క్లుప్తంగా

నేడు ప్రొసీడింగ్స్ అందజేత

మల్దకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. మండలంలో 480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరైనట్లు పేర్కొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ



అయిజ: రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత కంది విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో రైతులకు కంది విత్తనాల పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. మండలానికి మొత్తం 560 పాకెట్లు కంది విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. ఎల్ఆర్‌జీ- 52 రకం 375, పీఆర్‌జీ- 176 రకం 110, ఎల్ఆర్‌జీ- 105 రకం 75 పాకెట్లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొన్న టాటాఏస్

- యువకుడు మృతి

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై డీసీఎంను టాటాఏస్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. బెంగళూరుకు చెందిన సతీష్ (25), తన మిత్రుడు అప్పుతో కలిసి టాటాఏస్‌లో బ్యాటరీల లోడ్‌తో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నారు. జాతీయ రహదారిపై మునుగాల శివారులో వెళ్తుండగా.. అదేదారి గుండా ముందు వెళ్తున్న డీసీఎం ఎలాంటి ఇండికేటర్ ఇవ్వకుండా ఒక్కసారిగా ఎడమవైపు తిరగడంతో టాటాఏస్ వెనుక నుంచి డీసీఎంను ఢీకొట్టింది. దీంతో సతీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో కర్నూల్ దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టాటాఏస్ డ్రైవర్ అప్పు ఫిర్యాదు మేరకు పరారీలో ఉన్న డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నడిగడ్డ పోరాట పాట ఆవిష్కరణ

గద్వాల: జిల్లా కేంద్రంలో బుధవారం విజయవంతమైన ఇథనాల్ వ్యతిరేక ఉద్యమ నడిగడ్డ పోరాట పాటను అఖిలపక్ష కమిటీ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇథనాల్ వ్యతిరేక పోరాటానికి వెన్నుదన్నుగా ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు నిలబడాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మధుసూదన్‌బాబు, నర్సింహ, పల్లయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలో అక్రమ నిర్మాణాలను బుధవారం తొలగించినట్లు ఉండవెల్లి తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. పుల్లూరు గ్రామ పంచాయతీ అలంపూర్ చౌరస్తాలో సర్వే నంబర్ 250లో కొందరు అక్రమంగా షెడ్డు నిర్మాణానికి పునాది భీమ్‌ను నిర్మించగా ఆర్ఐ నాగరాజు పర్యవేక్షణలో కార్మికులు అక్రమ నిర్మాణాలు తొలగించినట్లు పేర్కొన్నారు.

ఉద్యమవీరుడికి ఘన నివాళి

అయిజ: మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ ఉద్యమకారుడు రాజగోపాల్‌రెడ్డి 24వ వర్ధంతి కార్యక్రమం బుధవారం వివిధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భగత్‌రెడ్డి, మాదన్న, హనుమంతు, ఆంజనేయులు, విజయభాస్కర్‌రెడ్డి, తాహెర్, పల్లయ్య, వెంకట్రాముడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గట్టు: మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన నేసే వీరేష్ (30) కుటుంబ సభ్యులను పలువురు నేతలు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జబురామన్‌గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్గెర హనుమంతునాయుడులు పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

కేసు నమోదు

వీరేష్ మృతి చెందిన ఘటనపై మృతుని సోదరి వీరేశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణుడు తెలిపారు.

నెరవేరనున్న సొంతింటి కల

- పైలెట్ ప్రాజెక్ట్‌గా చంద్రశేఖర్‌నగర్
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



చంద్రశేఖర్‌నగర్‌లో పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

మానవపాడు: ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ. 5 లక్షలు నిధులు మంజూరు చేస్తూ పేదవారి సొంతింటి ఇంటి నిర్మాణానికి పనులు ముమ్మరం చేసింది ప్రభుత్వం. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా చంద్రశేఖర్‌నగర్ ఎంపిక

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మండలంలోని చంద్రశేఖర్‌గనర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. దీంతో ప్రజా పాలనలో దరఖాస్తు చేసు



చెన్నిపాడులో ఇళ్ల నిర్మాణాలకు పూజలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కున్న 114 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాల గుడిసెలు తొలగించి వాటి స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు 37 ఇళ్ల నిర్మాణాలు నిర్మించాడానికి లబ్ధిదారులు ముందుకు రాగా, 17మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ లెవెల్‌కు వచ్చాయి. మిగిలిన లబ్ధిదారులు త్వరలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. 17 మందికి రూ.లక్ష చొప్పున మొదటి విడత డబ్బులు జమ అయినట్లు పేర్కొన్నారు.

రెండో విడతలో

రెండో విడతలో మండలంలో బోరవెల్లి- 25, జల్లాపురం- 25 చండూరు -15, పల్లెపాడు- 15, నారాయణపురం- 25, ఏ. బుర్దిపాడు- 15, అమరవాయి- 25, మానవపాడు- 35, కొర్విపాడు- 20, చెన్నిపాడు- 15, కలుకుంట్ల- 10, గోకులపాడు- 10, మద్దూరు- 25, పెద్దఆముదాలపాడు- 15, చిన్నపోతులపాడు- 15, పెద్దపోతులపాడు గ్రామంలో- 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయి, ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సొంతింటి కల నిజం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

గుడిసెలో అవస్థలు



పూరి గుడిసెలో నివసిస్తూ చాలా అవస్థలు పడుతున్నాం. ఎండ, వానలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాం. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

\- జయశీల, లబ్ధిదారు, చెన్నిపాడు

రూ.లక్ష జమ అయ్యాయి



చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఇళ్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం బేస్‌మెంట్ లెవల్ పూర్తయింది. రూ.లక్ష ఖాతాలో జమ అయ్యాయి. నాలుగు విడతల్లో రూ.5 లక్షలు ఖాతాల్లో జమవుతాయని అధికారులు తెలిపారు.ఇళ్లు మంజూరవడం సంతోషంగా ఉంది.

\- ఎస్తేరమ్మ, లబ్ధిదారు, చంద్రశేఖర్‌నగర్

వేగంగా పనులు



ఇందిరమ్మ పథకంలో మొదటి విడతలో చంద్రశేఖర్‌నగర్ పంచాయతీని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, అర్హులకు ఇళ్లు మంజూరు చేశాం. గ్రామంలో పనులు వేగంగా సాగుతున్నాయి. రెండో విడతలో త్వరగా నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను అవగాహన కల్పిస్తున్నాం.

\- భాస్కర్, ఎంపీడీఓ, మానవపాడు

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

అలంపూర్: కార్మికుల సమస్యల పరిష్కారం చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ యూనియ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 9న కన్‌స్ట్రక్షన్ కార్మికుల హక్కుల సాధనకు సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల ఇన్స్యూరెన్స్‌ను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేపట్టి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్మికుల ప్రమాద బీమా చెల్లింపులు లేబర్ శాఖ ద్వారా చెల్లింపులు జరగాలన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెద్దబాబు, నాయకులు మద్దిలేటి, జాను, మౌలాలి, మహ్మద్ రఫి, సాగర్, అశోక్, వంశీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి



ఊట్కూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాగశేషయ్య

అలంపూర్: మెగా హెల్త్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్యాతూర్ పీహెచ్‌సీ టీబీ నోడల్ పర్సన్ నాగశేషయ్య కోరారు. మండలంలోని లింగనవాయి, ఊట్కూరు, కోనేరు, బుక్కాపురం గ్రామాల్లో బుధవారం పర్యటించినట్లు తెలిపారు. ఈ నెల 26న బుక్కాపురం క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ క్యాంపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆశా కార్యకర్తలతో ఆయా గ్రామాల్లో పర్యటించినట్లు పేర్కొన్నారు. హెల్త్ క్యాంపులో 35 ఏళ్లు దాటిని ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు. క్యాన్సర్ లక్షణాలు గుర్తించి గద్వాలకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్య విస్తరణ అధికారి సత్యనారాయణ, సూపర్‌వైజర్ ఉలిగమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో కానరాని అధికారులు



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఉపాధి హామీ పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓ సమయపాలన పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ తప్పా సదరు అధికారులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రైవేటు పాఠశాలలపై అధికారుల దాడి



అయిజలో బుక్ సెంటర్‌కు తాళం వేయిస్తున్న ఎంఈఓ రాములు



మల్దకల్‌లో న్యూట్రినిటీ పాఠశాలలో గది సీజ్ చేస్తున్న అధికారులు

మల్దకల్: మండల కేంద్రంలోని న్యూ ట్రినిటీ ప్రైవేట్ పాఠశాలపై అధికారులు బుధవారం దాడి చేశారు. పాఠశాలలోని పుస్తకాల గదిని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ సీజ్ చేశారు. కొన్ని రోజులుగా పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పాఠశాలను తనిఖీ చేసి పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుక్ సెంటర్‌కు తాళం

అయిజ: మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి పాఠశాల యాజమాన్యం పాఠశాల పక్కన బుక్ స్టోర్ ఏర్పాటు చేసుకొని పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీఈఓ అబ్దుల్ గని ఆదేశాల మేరకు ఎస్ఎస్ బుక్ సెంటర్‌ను ఎంఈఓ రాములు తాళం వేశారు.

తల్లిదండ్రులకు నమ్మకం కలిగించండి



పుల్లూరులో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నాణ్యమైన విద్యను అందిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని మండల విద్యాశాఖ అధికారి అశోక్‌కుమార్ అన్నారు. అలంపూర్ మండలం క్యాతూర్ బాలుర, ఎంపీపీఎస్, బాలికల పీఎస్, ఉర్దూ ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, మండలంలోని కోనేరు, గొందిమల్ల ఎంపీయూపీఎస్, భైరన్‌పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులను సైతం సర్కారు బడిలో చేరే విధంగా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కేటీదొడ్డి: మండల పరిధిలోని నందిన్నె ఉన్నత పాఠశాల, కుచినెర్ల, సిద్దోనిపల్లి, మల్లాపూర్ గ్రామాల్లోని పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, బ్యాగులు, టై, షూ తదితర వస్తువులను ప్రిన్సిపాల్ దేవానందం బుధవారం అందజేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న విశ్వనాథ్, సంపత్‌కుమార్

రాజోలి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం దినదినాభివృద్ధి చెందుతుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన అలంపూర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని, గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గానికి అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన సంపత్ కుమార్ ఓడిపోవడం నియోజకవర్గ ప్రజల దురదృష్టకరమని, ఆయన గెలిచి ఉంటే మంత్రి హోదాలో అలంపూర్ నియోజకవర్గ గ్రామాలు అభివృద్ధి బాటలో ఉండేవని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్న ప్రతి చోట అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఇవ్వడంతో ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసాను విడుదల చేసిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరింత ప్రభంజనం సృష్టించబోతుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం పాటు పడాలని అన్నారు. కార్యక్రమంలో క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, సీతారామి రెడ్డి, దొడ్డెప్ప, కుమార్, నీలి శ్రీనివాసులు,నాగశిరోమణి,నాగరాజు తదిదరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జ్ విశ్వనాథ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి వారికి అర్చకులతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామి శ్రీజోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా అమావాస్య పూజలు



వెంకటాపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

గట్టు/అయిజ/మల్దకల్/కేటీదొడ్డి/కేటీదొడ్డి/ధరూరు/ఉండవెల్లి/మానవపాడు: అమావాస్య సందర్భంగా గట్టు మండంలోని ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. మంటెద్దుల అమావాస్యగా సందర్భంగా మట్టితో ఎద్దులు (కాడెద్దులు) బొమ్మలు తయారుచేసి వాటికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. గండి ఆంజనేస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

✡ అమావాస్యను పురస్కరించుకొని అయిజ మండల కేంద్రం, మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అయిజ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు.

✡ మల్దకల్ ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు రమేషాచారి, రవిచారి, ధీరేంద్రదాసు, శశాంక్, చంద్రశేఖర్‌రావు, పాల్గొన్నారు.

✡ కేటీదొడ్డి మండల పరిధిలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

✡ ధరూరు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, మండల పరిధిలోని పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, అల్వాలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కిష్టాచార్యులు, మద్వాచార్యలు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

✡ ఉండవెల్లి మండలంలోని డి.బూడిదపాడు, బైరాపురం ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా స్వామికి అభిషేకం నిర్వహించారు.

✡ మానవపాడు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదానం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఆదిశిలా క్షేత్రంలో అమావాస్య పూజలు చేస్తున్న భక్తులు



పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



డి.బూడిదపాడులో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

గుప్తనిధుల కోసం తవ్వకాలు



ఆలయం ఆవరణలో తవ్విన గుంతను పరిశీలిస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

మానవపాడు: మండల కేంద్రం శివారులోని ఆంజనేయస్వామి ఆలయం వెనక గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ఘటన మండలంలో కలకలం సృష్టించింది. బుధవారం అమావాస్యను పురస్కరించుకొని స్వామివారికి పూజలు చేసేందుకు వెళ్లిన భక్తులు ఆలయం ఆవరణలో చేసిన తవ్వకాలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ ఆంజనేయులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం



మానవపాడులో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అలంపూర్‌లో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్ఐ తరుణ్

అలంపూర్: మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దామని ట్రైనీ ఎస్ఐ తరుణ్ అన్నారు. పట్టణంలోని హరిజనవాడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మాదక ద్రవ్యాలపై నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుకు అలవాటుపడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు అమరేందర్‌రెడ్డితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎర్రవల్లి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇటిక్యాల ఏఎస్సై సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. మాదక ద్రవ్యాల సమాచారం తెలిసిన వారు 100, 14446, 1908కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

సీడీపీఓ ఆధ్వర్యంలో

మానవపాడు: మండలం కేంద్రంలో ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాల్ పోస్టర్లను ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అనితబాయ్ ఆధ్వర్యంలో ఎస్ఐ శేఖర్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.